భాష – అంతర్జాతీయ భావన

విద్యాభ్యాసము, జ్ఞాన సముపార్జన, విజ్ఞానశాస్త్ర అధ్యయనము, ఆంగ్ల భాషాధ్యయనములో మాతృభాష ప్రాధాన్యత

ఆంగ్ల మూలం

జోగా సింగ్

తెలుగు సేత

మనోహర్ బోరంచ

ముందుమాట

మానవ క్రియాశీలత యొక్క ప్రతి క్షేత్రానికి భాష వ్యాపిస్తుంది. కానీ, ఏ ప్రజల భౌతిక, అధ్యాత్మిక అభివృద్ధికైనా అతి కీలకమైన ఈ పరిధి భారత విధాన నిర్ణేతలచే ఉపేక్షింపబడింది. ఇది ఉపేక్షింపబడడమేకాకుండా, భారత మాతృ భాషలకు సంబంధించిన రాజ్యాంగపరమైన, ఆధునిక భారత నిర్మాతలైన స్వాతంత్ర్య సమర యోధుల వివేకాన్ని రుజువుచేసే ఏర్పాట్లు కూడా తొక్కివేయబడుతున్నాయి. ఈ ఏర్పాట్లు ప్రతి భారతీయుడికి తన మాతృ భాష ద్వారా విద్యనార్జించే హక్కును కల్పిస్తాయి. విధాన నిర్ణేతల ఈ నేరపూరిత నిర్లక్ష్యం భారత జాతీయ జీవనపు వివిధమైన అతి ముఖ్య రూపాలను, ప్రత్యేకించి ఏ జాతి అభివృద్ధికైనా ప్రాణాధారమైన విద్యా రంగాన్ని, గందరగోళంచేసింది.

ఆసియాలోని మొదటి 50 స్థానాల్లో ఒక్క భారతీయ విశ్వవిద్యాలయం కూడా లేకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఏ ఆసియా దేశం కూడా తన పౌరులకు విదేశీ భాష ద్వారా విద్యను అందిచదనేది మనం గుర్తుంచుకోవాలి. కనీసానికి వాణిజ్యపరమైన రంగంలో కూడా భారత వాటా ప్రపంచ వాణిజ్యంలో స్వాతంత్ర్యంనాటి నుంచి నిరంతరంగా పతనమవుతూనే ఉంది. యాభై మిలియన్ల జనాభా కలిగిన దక్షిణ కొరియా దేశం ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం కంటే 15 స్థానాలు పైన ఉంది.

మాతృభాష ద్వారానే సఫలతగల విద్య వీలవుతుందని అంతర్జాతీయ పరిశోధన ప్రబలంగా నిరూపిస్తుంది. ఇతర అంశాలు సమానమైనప్పుడు, మాతృభాషలో విద్యార్జన చేసిన పిల్లవాడు విదేశీ భాషలో విద్యార్జన చేసిన పిల్లవాడి కంటే ఒక విదేశీ భాషను బాగా నేర్చుకొంటాడని కూడా ఇది తెలియజేస్తుంది. ఇది వింతగా అనిపించినా పచ్చి నిజం.

భాషా విధాన సమస్యల గురించిన అజ్ఞానం భారత విధాన నిర్ణేతల మనసుల్లో ఎంతగా వ్యాప్తిచెందిందనే విషయాన్ని ఎంత తక్కువగా చెప్పుకొంటే అంత మంచిది. భాషా విధాన సమస్యలపై అంతర్జాతీయ పరిశోధన మరియు అభ్యాసం యొక్క ఫలితాలను సంక్షిప్తంగా అందించి ఈ అజ్ఞానాన్ని తొలగించే ప్రయత్నమే ఈ పత్రం. నా తోటి భారత పౌరులు ఈ ప్రయత్నాన్ని ఉపయోగకరమైందిగా గుర్తిస్తారని ఆశిస్తాను.

తెలుగులోకి దీన్ని అనువదించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన మనోహర్ బోరంచ గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతను వ్యక్తపరచడానికై ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలనుకొంటున్నాను. సమస్య ప్రాముఖ్యత యెడల అతనికి ఉన్న అవగాహనకు గాను, నేను అతనికి కృతజ్ఞున్ని. ఈ అనువాదం అతని మనఃపూర్వక ప్రయత్నాలు లేకుండా సాధ్యమయ్యేది కాదు.

ఈ పత్రం యొక్క పంజాబీ, హిందీ, ఆంగ్ల రూపాలు ఇప్పటికే ప్రచురింపబడ్డాయి. ఇది మైథిలి, తమిళం, మరాఠీ లోకి అనువదింపబడింది. ఈ రూపాలు త్వరలో ప్రచురింపబడుతాయి. తెలుగు, మలయాళం, నేపాలీ, బంగ్లా, కొంకణి మరియు డోగ్రి అనువాదాలు మార్గంలో ఉన్నాయి. భారత పౌరులు వారంతట వారుగా (అంతర్జాలంలో ఈ పత్రాన్ని

చదివాక) ఈ పని చేయడం నాకు ఎనలేని ఆనందాన్ని ఇస్తుంది. వాళ్లల్లో ఎక్కువ మందికి నాతో పూర్వ పరిచయం లేకపోవడమనేది మరింత సంతృప్తిదాయకం. నేను వాళ్లందరికి నమస్కరిస్తాను.

తెలుగులో ఈ పత్రాన్ని చూడడం నాకు వివరణకు మించిన ఆనందాన్నిస్తుంది. ఈ తెలుగు రూపాన్ని తెలుగు ప్రజలకే అంకితమిస్తాను.

పటియాల జోగా సింగ్

29 ఆగష్టు 2013

నా మాట

మాతృ భాష తల్లిపాల వంటిది. పర భాష పోతపాల వంటిది. తల్లిపాలు తాగి పెరిగిన వాడికి, పోతపాలు తాగి పెరిగిన వాడికి ఎంత తేడా ఉంటుందో, మాతృభాషలో విషయం నేర్చుకున్న వాడికి, పరభాషలో నేర్చుకున్న వాడికి అంతే తేడా ఉంటుంది.

- కొమరరాజు లక్ష్మణరావు

పిల్లలకు 'పోతపాల భాష' ను పట్టిస్తున్నాం. అందుకే, బలహీనంగా ఉంటున్నారు. వీళ్లున్నట్టే, వీరి ముందు తరం ఆ ముందు తరం ..... చేజేతులా మన భాష, సంస్కృతి, చరిత్రలను సర్వనాశనం చేసుకుంటు న్నాము.

"శిశువు సౌందర్యదృష్టిని, ఆనందానుభూతిని వ్యక్తం చేయడానికి ఉపయోగపడేది మాతృభాష" అంటాడు గాంధీజీ. ఎవరికి కావాలి గాంధీగారి మాటలు. ఆయన ఒక కొల్లాయి కట్టుకున్నవాడు, సూటు, బూటు వేసుకున్న వాడు కాదుగా!

అసలు, గాంధీజీ చెప్పిన మాటలను వినియుంటే భారతదేశపు స్థితి ఇంత దయనీయంగా ఉండేదా!

ప్రపంచ వ్యాప్తంగా ... పరిశీలనలు, పరిశోధనలు చేసిన విద్యావేత్తలు ... "బోధించే భాషలన్నింటిలో మాతృభాషకు ప్రధాన స్థానం ఉండాలనీ, మాతృభాషయే బోధనా మాధ్యమంగా ఉండాలనీ" ఘోషిస్తున్నారు.

ఈ అభిప్రాయాలనే ఆవేదనతో, ఆధారాలతో డా. జోగా సింగ్ విర్క్ గారు తన పత్రములో పొందుపరిచారు. ఈ పత్రము, భారతీయ విద్యా నీతిని సిద్ధంచేసి, మాతృ దేశపు బాలబాలికల మస్తిష్కాలపై విదేశీభాష(ల)ను రుద్దుతున్న కుహనామేధావులకు కనువిప్పు కలిగించేలా ఉన్నది.

దీనిని తెలుగులోనికి అనువదించి తెలుగు వారందరికి అందించే అవకాశాన్ని నాకు కల్పించిన మిత్రుడు డాక్టర్ జోగా సింగ్ విర్క్ కు ధన్యవాధాలు తెలుపుకుంటున్నాను.

1979-'80 లో, NRLC పటియాలలో పంజాబీ భాషా శిక్షణలో ఉన్నప్పుడు నేను, జోగా సింగ్ మిత్రులం. 33 సంవత్సరాల తరువాత అంతర్జాలం (internet) పుణ్యమా అని మేమిద్దరం కలుసుకున్నాం. ఆనాటి చనువుతో, నన్నీ పనికి పూనుకొమ్మన్నారు. నేను నా శక్తి సామర్థ్యాలపై సందేహించాను. నా వెన్నుతట్టి కార్యోన్ముఖుణ్ణి చేశారు డాక్టర్ జోగా సింగ్.

ప్రపంచ విద్యావేత్తల భావాలను, డాక్టర్ జోగా సింగ్ గారి భావాలను నా మాటల్లో మీ ముందుంచుతున్నాను. తప్పులుంటే అవి నావి. పైన పేర్కొన్న పెద్దలవి ఏమాత్రం కావని సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఇది చదివి, రవీంద్రనాథ ఠాగూరు చెప్పినట్లుగా, "పరభాషా మాధ్యమంలో బోధన, సోపానాలు లేని సౌధం లాంటిది" అనే విషయాన్ని అందరు గ్రహిస్తే ఈ పని సార్ధకమైనట్టు.

అమ్మ భాషలు వర్ధిల్లాలి!

హైదరాబాదు

15 సెప్టెంబర్ 2013

బోరంచ మనోహర్

విశ్రాంత గజిటెడ్ ప్రధానోపాధ్యాలు

***

ఆంగ్లంలో వెలువడిన చిన్న పుస్తకం పై కొన్ని అభిప్రాయాలు

1. 'International Opinion on Language Policy: Mother Tongue is the Key to Education, Knowledge, Science, and English Learning' అనే పత్రంలో మీరు వెలిబుచ్చిన వాదనల మరియు నిజాల తీవ్రతకు, ఔచిత్యతకు, అలాగే దాని చివరన చేసిన ప్రకటనకు నేను అతిగా ప్రభావితమయ్యాను. అందుకనే, నేను ఈ పత్రాన్ని నా మాతృభాషయైన మైథిలి లోకి అనువదించాను. ఎక్కువలో ఎక్కువ మంది పాఠకులను ఈ పత్రం చేరుకున్నప్పుడు మాత్రమే, అది దాని పూర్తి ప్రయోజనాన్ని ఇవ్వగలుగుతుంది.

Shambhu Kumar Singh, Education Advisor, National Translation Mission, Central Institute of Indian Languages, (Ministry of Human Resource Development, Govt. Of India), Mysore.

2. విషయం యొక్క పండిత వివరణకు గాను మీకు ధన్యవాదాలు.

Harbans Lal, Ph.D., D.Litt (Hons), Emeritus Professor and Chair, Pharmacology & Neuroscience, U. North Texas Health Science Center.

3. అతిగా ప్రభావితంచేసే సామగ్రికి గాను ధన్యవాదాలు.

Prof. G.S. Bhandal, Brampton.

4. విషయపు లోతును తాకే మీ వ్యాస ప్రతిని పంపినందుకు ధన్యవాదాలు. దీన్ని చదవడాన్ని నేను నిజంగా ఆనందించాను,

Dr. Tej K. Bhatia, Professor, Linguistics & Cognitive Sciences, Chancellor's Exceptional Academic Excellence Professor, Faculty Fellow, Forensic Sciences and National Security Institute, Syracuse University, Syracuse, New York.

5. ఇద్దరు చిన్న పిల్లలకు తల్లిగా, దీన్ని చదవడం ఎంతో విజ్ఞానదాయకం. ఇక్కడ అబాట్స్ఫోర్డ్, BC లోని ఒక ప్రైవేట్ పంజాబీ పాఠశాలలో మా అబ్బాయిలను చేర్చాలని నేను ఎప్పుడూ ప్రణాళిక వేసుకొనేదాన్ని, మేము అలా చేయడం సరియైన నిర్ణయమే అని నాకు ఇప్పుడు అనిపిస్తుంది. అద్భుతమైన పనిని దయచేసి కొనసాగించండి.

Sharanjit Kaur Sandhra, MA, Coordinator, Centre for Indo Canadian Studies, University of the Fraser Valley

6. అమ్మ మీద మీ చిన్న పుస్తకం అద్భుతమైన సమాచారం.

Khushal lali, Journalist, Chandigarh

7. ఇది మన ప్రస్తుత అన్వేషణ కోసం సరియైన సమయానికి వచ్చింది.

Prof.Rajesh Sachdev, Language Planning Consultant, Former Director I/c, Central Institute of Indian Languages, Manasagangotri, MYSORE.

8. దీన్ని నేపాలీ భాష లోకి అనువదించాలని నాకు ఆసక్తిగా ఉంది.

Prof. Dr. Kedar Prasad Poudel, Head of English & Linguistics, Mahendra, Multiple Campus, Dharan -10, NEPAL.

9. మాతృ భాషలకు, స్థానిక భాషలకు సంబందించి ఎత్తిచూపిన ఆందోళనలు నిజమైనవి, గంభీరమైన చర్చోపచర్చలు అవసరం.

Prof. Jai Rup Singh, Vice-Chancellor, Central University of Punjab, Bhatinda.

10. నేను మీ పత్రాన్ని బెంగాలీ లోకి అనువదించడానికి ప్రయత్నిస్తాను.

Srutinath Praharaj, Commerce R P M College, Culcuatta University, Kolkata.

11. మహారాష్ట్రలో విద్య, ముఖ్యంగా భాషా విద్య గురించిన ఒక విస్తృత చర్చ జరుగుతుంది. ఈ విషయంలో మీ వ్యాసం ఒక గొప్ప స్పష్టతను అందించింది. ప్రపంచంలో భాషా విద్య యొక్క వివరాలను, వాదనలను మీరు అతి సాధారణ పదాల్లో వ్యక్తీకరించారు. ఏ సాధారణ వ్యక్తియైనా వాటిని అర్థం చేసుకోవచ్చు. విద్య, సాంఘిక రంగాలలో నిమగ్నమైన కార్యకర్తలకు నేను ఈ వ్యాసాన్ని పంపాను.

Ms Vinaya Malati Hari, Child Education Centre, Pune.

12. వ్యావహారికంలో బోధనా మాధ్యమం గురించిన మీ పాండిత్యపూరితమైన రచనను నాకు పంపినందుకు గాను చాలా ధన్యవాదాలు. ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకు పిల్లలను పంపడమనే అంటువ్యాధి లాంటి ఫాశనుతో పూర్తిగా గందరగోళానికిగురై, ఆందోళనచెందే వారికి మీ పత్రం ఎంతో జ్ఞానవర్ధకమైనది.

Manprasad Subba, Bijanbari, Sahitya Akademi Award winning writer, Darjeeling.

13. పరిశోధక విద్యార్థులకు, భాషాశాస్త్రజ్ఞులకు విషయం చాలా విలువైనది. మీ ప్రయత్నాల్ని, కఠిన శ్రమను ఈ విషయంలో నేను గుర్తించాను.

Dr A. Ramalingeswara Rao, Dept of Space, Sriharikota.

14. విలువైన పత్రానికి చాలా ధన్యవాదాలు. మా సందర్భానికి ఇది చాలా ముఖ్యమైందని తెలుసుకొన్నాను.

Bhabendra Bhandari, Professor, Tribhuvan University, Nepal.

15. ఒక కవితా వాదన.

Prakash Prabhakar, Eminent Punjabi poet.

భాష – అంతర్జాతీయ భావన

విద్యాభ్యాసము, జ్ఞాన సముపార్జన, విజ్ఞానశాస్త్ర అధ్యయనము, ఆంగ్ల భాషాధ్యయనములో మాతృభాష ప్రాధాన్యత

I. ప్రస్తావన

గత మాసం, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీసు పరీక్షలకు సంబంధించి ఒక తిరోగమన ప్రకటన జారీచేసింది. 'ఆంగ్ల భాష పేపరు' ను వ్రాయడం తప్పనిసరి చేయడమే కాకుండా దానిలో సంపాదించిన మార్కులను మెరిట్ కు లెక్కించడమే ఆ తిరోగమన చర్య. ఇది మరొకసారి భాషా సంబంధమైన సమస్యల చర్చను రగిలించింది. కేంద్ర ప్రభుత్వపు ఈ అనాలోచిత ప్రకటనపై దృష్టి సారించడమే ఈ పత్రమును సిద్ధపఱచుటలోని ముఖ్య ఉద్దేశ్యము.

భాషావేత్తల, రాజకీయవేత్తల నిరసనలకు జడిసి తన ఈ ప్రకటనను కేంద్ర ప్రభుత్వము 15 మార్చిన ఉపసంహరించుకున్నది. తమను తాము శ్రేష్ఠులుగా భావించి, భారతీయ భాషల పట్ల చిన్నచూపు చూసే ఈ కుహనా మేధావుల ఆలోచనాధోరిణి దయనీయం. భాషకు విద్యతో, విజ్ఞాన శాస్త్రంతో, సంస్కృతితో, వారసత్వంతో అవినాభావ సంబంధం ఉన్నది. ముఖ్యంగా, విదేశీ భాషను నేర్చుకోవాలంటే 'మాతృ భాష' ప్రధాన పాత్రను పోషిస్తుంది.

బ్రిటీషువాళ్లు భారతదేశాన్ని వదిలివెళ్లిన తరువాత కూడా భారతీయ భాషలకు న్యాయబద్ధమైన స్థానం లభించలేదు, సరికదా గత 30 సంవత్సరాలుగా పరిస్థితి మరీ దిగజారుతూ వస్తున్నది. చివరకు పాఠశాలలో బోధనామాధ్యమ స్థానాన్ని కూడా ఆంగ్లమే ఆక్రమిస్తున్నది. దీనికి అసలు కారణం భారత దేశపు కుహనా మేధావుల అనాలోచిత, స్వార్థపూరిత ప్రయోజనాలు. కాని, తమ అవివేకానికి మద్దతుగా ఈ వాదనలు చేస్తున్నారు:

1. విజ్ఞానశాస్త్రము, ఇతర శాస్త్రాల జ్ఞానమంతా ఆంగ్లభాషలోనే నిక్షిప్తమైయున్నది. కనుక, మనం పురోగమించాలంటే ఆంగ్లభాషలో బోధన తప్పనిసరి.
2. అంతర్జాతీయంగా సమాచార వ్యవస్థ, వాణిజ్య వ్యవస్థ సమస్తం ఆంగ్లభాషలోనే నడుస్తుంది కనుక ఆంగ్లంలో బోధన తప్పనిసరి అని.

ఈ వాదనలు అవివేకానికి నిదర్శనాలు. ప్రపంచ వ్యాప్తంగా నున్న అన్ని భాషలతో విజ్ఞాన శాస్త్రానికి లేదా ఇతరేతర జ్ఞాన సముపార్జనకు ఉన్న సంబంధాన్ని గ్రహించక పోవడమే. కుహనా మేధావుల అవివేకపు పొరలను తొలగించి, వాస్తవాన్ని దర్శింపజేయడమే ఈ పత్రము యొక్క లక్ష్యం.

II. మాతృభాష, ఇతర భాష, మరియు విద్య

ప్రపంచ దేశాల వ్యాప్తంగా భాషకు – విద్యకు, భాషకు – విజ్ఞానశాస్త్రానికి, భాషకు – జ్ఞాన సముపార్జనకు గల సంబంధాన్ని మొదట పరిశీలించాలి. 1953లో UNESCO విడుదల చేసిన "The Use of Vernaculars in Education" అనే పుస్తకములో నున్న ఈ క్రింది విషయాలు జ్ఞానోదయాన్ని కలుగజేస్తాయి; అంతర్జాతీయంగా ఈ విషయముపై జరిగిన పరిశోధనలను గురించీ తెలుపుతాయి:

"మాతృభాషలో విద్యాబోధన అత్యుత్తమం" అనేది నిర్వివాదాంశం. మనస్తత్వశాస్త్ర పరంగా ఆలోచిస్తే, మాతృభాషలో అర్థంచేసుకోవడం, వ్యక్తపఱచడం సులభం. విద్యాపరంగా ఆలోచిస్తే, విద్యార్థి ఏ ఇతర భాషా మాధ్యమంలో కన్నా గూడా, మాతృభాషా మాధ్యమములోనే తొందరగా విషయాన్ని గ్రహించగలడు." *@ (UNESCO, 1953: 11)*

ఇది విస్తృత పరిశోధనల అనంతరం UNESCO వెలుబుచ్చిన అభిప్రాయం. 1968లో మళ్లీ UNESCO ఇలా అన్నది:

"... మాతృభాషలో బోధన వీలైనంత ఎగువస్థాయి వరకు జరగాలి." *@ (UNESCO, 1968: 691)*

2004 సంవత్సరపు యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంటల్ రిపోర్టులో ఈ విధంగా లిఖించబడింది:

"ద్విభాషాబోధనా పద్ధతిలో (టగాలగ్ (Tagalog) మరియు ఆంగ్లము) బోధన జరిపే ఫిలిప్పీన్సులో, టగాలగ్ భాషను తమ ఇంట్లో మాట్లాడని వారు కూడా టగాలగ్ భాషలో అత్యుత్తమ ప్రతిభను కనబఱచారు." *@ (UNDP Report 2004: 61)*

అత్యధిక సంఖ్యాకులు ఆంగ్లమును తమ మాతృభాషగా కలిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాల కథనాన్ని గమనించండి:

"అ.సం.రా.లలో, నవహో (Navajo) విద్యార్థులు వారి భాషయైన నవహో భాషను ప్రథమ భాషగా, ఆంగ్ల భాషను ద్వితీయ భాషగా ప్రాథమిక స్థాయి వరకు బోధింపబడ్డారు. కేవలం ఆంగ్ల భాష లోనే విద్యాభ్యాసము గావింపబడిన సహాధ్యాయుల కంటే, నవహో భాషను ప్రాథమిక స్థాయిలో ప్రథమ భాషగా విద్యాభ్యాసము చేసిన పిల్లలే అత్యుత్తమ ప్రతిభను చూపగలిగారు." *@ (UNDP Report 2004: 61)*

భారత ఆంగ్ల భాషా వ్యామోహపరులకు మనఃపూర్వకంగా, వ్యక్తిగత విన్నపము చేయదలిచాను. ప్రధానంగా ఆంగ్ల భాషను మాట్లాడే ప్రజలున్న అమెరికా, కెనడా, న్యూజిలాండ్ దేశాలలో ఎంత పెద్ద సంఖ్యలో ఆంగ్లేతర భాషా మాధ్యమమున్న పాఠశాలలు ఉన్నాయో పరికించండి. ప్రపంచ వ్యాప్తంగా, ఈ అంశముపై చేయబడిన విశ్లేషణలను గమనించండి:

"మెక్సికోలో మోదియానో (1968, 1973), ఫిన్లాండ్ లో Skutnabb-Kangas (1965), ఇంకా Gudschinsky (1975) యొక్క పరిశోధనా ఫలితాల ప్రకారం, స్వదేశీ భాష (మాతృభాష) లో పాఠశాల చదువు ప్రారంభించి, తదనంతరం ద్వితీయ భాషగా విదేశీ భాషను నేర్చుకున్న విద్యార్థులు తమ స్వదేశీ భాషలో సాధికారతను సాధించారు. అక్షరాస్యతా శాతం కూడ పెరిగింది. ద్వితీయ భాషగా నేర్చుకున్న విదేశీ భాష లోనూ ప్రావీణ్యతను సాధించారు. చాల

సంవత్సరాలపాటు పాఠశాల చదువును కొనసాగించారు. కేవలం విదేశీ భాషలో విద్యాభ్యాసము చేసిన విద్యార్థుల విషయంలో పై విషయాలు తద్విరుద్ధంగా ఉండడం గమనార్హం." *@ (Tucker, 1977: 3)* ('ద్వితీయ భాష' ను 'విదేశీ భాష' గా చదవండి).

ఫిన్లాండ్ నుండి స్వీడన్ కు వెళ్లి స్థిరపడిన పిల్లల చదువుపై చేసిన పరిశోధన ఇలా ఉంది:

"ఫిన్నిష్ భాషా నైపుణ్యము గణితములో మార్కులు/గ్రేడ్ సంపాదించడంలోనూ కొట్టొచ్చినట్టు కనబడింది. ఉన్నత విద్యా స్థాయిలో, స్వీడిష్ భాషలోనే గణితమును బోధించి నప్పటికీ అటువంటి ఫలితాలే అగుపడ్డాయి. ఈ ఫలితాలు స్పష్టపరుస్తున్నదేమంటే – గణిత సంబంధమైన సమస్యల పరిష్కారానికి మాతృభాషలో ఆలోచన అన్న అంశం ప్రశంసనీయంగా పనిచేస్తుంది అని. ఇదేకాకుండా జీవశాస్త్రము, రసాయనశాస్త్రము, భౌతికశాస్త్రము పరిపూర్ణంగా అర్థంచేసుకోవడానికి 'మాతృభాషలో ఆలోచన' చక్కగా ఉపయోగపడింది అని. ఎవరైతే స్వదేశీభాష/మాతృభాషలో తగినంత ప్రావీణ్యాన్ని సాధించలేక పొయారో వారికన్న వీరు ముందున్నారు. *@ (Skutnabb-Kangas and Toukomaa, 1976)." (quoted in Paulston, 1977, 1977: 94)*

అమెరికాకు సంబంధించి మరొక విషయాన్నీ చూద్దాం:

"ఆంగ్లేతర భాషలను తమ మాతృభాషగా కలిగి, అమెరికాలో నివసిస్తున్న వారికి ఆంగ్లములో మాత్రమే బోధన అన్న ఏక భాషా మాధ్యమ బోధన అంతగా ఉపకరించలేదనీ, వారు తగినంత ప్రావీణ్యాన్ని ప్రదర్శించలేకపోయారనీ, దీనికి కారణం స్వదేశీ/మాతృ భాషకు వారిని దూరంగా ఉంచడమే." *@ (Tucker, 1977: 3)*

ఘనా విషయానికొస్తే:

"Bokamla and Tlou (1977: 45) ప్రకారము ... ఘనాలో, ప్రాథమిక విద్య పూర్తిచేసిన విద్యార్థులలో కేవలము 5% విద్యార్థులు మాత్రమే మాధ్యమిక విద్యాభ్యాసానికై వెళుతున్నారు. Zaire లో, పాఠశాలలో చేరిన విద్యార్థులలో కేవలము 30% విద్యార్థులే 4వ తరగతి వరకు చదువుతున్నారు. విదేశీ భాషా మాధ్యమ బోధనతో భాషా నైపుణ్యాలను పెంపొందించుకొనే శక్తి లోపించడమే దీనికి ప్రధాన కారణము అంటారు ఈ రచయితలు." *@ (Fasold, 1984: 306)*

ఇక .... "విద్యార్థులు ఆంగ్ల భాషను నేర్చుకొనకపోతే విజ్ఞానశాస్త్రాన్ని, గణితాన్ని అర్థంచేసుకోజాలరు అన్నమాట శుద్ధ అబద్ధం. విజ్ఞానశాస్త్ర విషయాలు, భావనలు కేవలం ఒక భాషకో, ఒక సంస్కృతికో, కట్టుబడి ఉండవు. రష్యన్లు, జర్మన్లు, ఫ్రెంచ్ దేశీయులు ఆంగ్ల భాషను ఉపయోగించకుండా తమ అత్యుత్తమమైన శాస్త్రీయ పరిశోధనలను ఆవిష్కరిస్తున్నారు. 2003 సంవత్సరంలో నిర్వహింపబడిన Trends in International Mathematics and Science Study (TIMSS) లో అత్యుత్తమంగా నిలిచిన ఐదు దేశాలు, సింగపూర్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, హాంకాంగ్, చైనీస్

తైపీ, మరియు జపాను. ఈ దేశాల విద్యాలయాలలో ఆంగ్లము ప్రథమ భాషగా బోధింపబడదు, అన్న సత్యాన్ని గమనించండి." @ *(Ricardo and Nolasco, 2009: 6)*

ఆంగ్ల భాష పుట్టని నాడే మన దేశము, అరబ్ దేశాలు "విజ్ఞాన ఖనులు" అని పేరే చెప్పాలా!

నార్వే దేశపు Global Monitoring Report (Benson, 2005) ప్రకారం:

"యోరుబా మీడియం ప్రైమరీ ప్రాజెక్టు (Fafunwa et al. 1975; Akinnaso 1993; see Adegbiya 2003 for other references) సత్ఫలితాల నిచ్చింది. 6 సంవత్సరాల పాటు మాతృభాషలోనే అన్ని విషయాలను బోధిస్తూ, ఒక విదేశీ భాషను ద్వితీయ భాషగా బోధించడం వల్ల చక్కని ఫలితాలు వచ్చాయి. ఈ ఫలితాలు ఆంగ్లమాధ్యమ పాఠశాలల ఫలితాల కన్న మెరుగ్గా ఉన్నాయి...." @ *(Benson, 2005)*

ఇవన్నీ పరిశీలించిన తరువాత, ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు నిరూపించబడిన విషయం ఒకే ఒక్కటి: అది విద్యలో విజయం కేవలం మాతృభాషా మాధ్యమంలోనే సాధ్యం అనేది. విదేశీ భాషా మాధ్యమంలో అసాధ్యం అని. మాతృభాషలో విధ్యా బోధన అత్యుత్తమం అన్నది అసత్యం కాదు అనడానికి ఇవి కారణాలు:

"బాలుడు/బాలిక తన మాతృభాషలో నిర్భయంగా, నిస్సంకోచంగా, తప్పులులేకుండా తన అభిప్రాయాలను బహిరంగపరచగలగడం. పలు భాషలు నేర్పడం వల్ల ... అంటే ...మాతృభాషా మాధ్యమంగా అన్ని సబ్జెక్టులు నేర్పుతూ ఇతర విదేశీ భాషలను ఒక సబ్జెక్టుగా బోధించడం వల్ల సత్ఫలితాలు కలుగుతాయి. విదేశీ భాషను నేర్చుకోవడానికి ఉత్సుకత చూపుతారు. మాతృభాషను ప్రథమ భాషగా ఎంచుకొని చదివిన విద్యార్థి రెండవ భాష, మూడవ భాష విషయానికి వచ్చేటప్పటికి అంతకు ముందే తాను పక్కాగా నేర్చుకొని ఉన్న భాషలో చక్కని ఆలోచన చేయడం, భావ వ్యక్తీకరణ సుస్పష్టంగా చేయడానికి సంసిద్ధుడు కావడం జరుగుతుంది. ఇది ఉపాధ్యాయులకూ ఉపయుక్తంగానే ఉంటుంది. విద్యార్థి నిర్భయంగా, నిస్సంకోచంగా, తప్పులు లేకుండా భావవ్యక్తీకరణ చేయగలుగుతాడు కనుక విద్యార్థి ఎంతవరకు నేర్చుకున్నాడు, ఎక్కడ తప్పులు చేస్తున్నాడు, ఇంకా ఏమి నేర్చుకోవలసి ఉన్నది అన్న విషయాలు ఉపాధ్యాయులకు అవగతమై పోతాయి. బహు భాషలు నేర్పడం వల్ల, పాఠశాలలోనున్న, సమాజంలోనున్న ఇతర వ్యక్తులతో సత్సంబంధాలూ నెలకొంటాయి. వారితో ఏర్పడిన సత్సంబంధాలతో విద్యాభ్యసనానికి కావలిసిన అదనపు సమాచారాన్ని, బోధనోపకరణాలను సమకూర్చుకోగలుగుతారు. తమ భాష, తమ పిల్లలు నేర్చుకునే భాష ఒకటే అయినందున పోషకులూ తమ పిల్లల చదువుపట్ల ఎక్కువ శ్రద్ధాసక్తులను చూపుతారు. పాఠశాల కార్యక్రమాలతో, పోషకులు సాన్నిహిత్యాన్ని పెంచుకుంటారు." *(Ricardo and Nolasco, 2009: 4)*

మాతృభాషా మాధ్యమములో బోధన జరుగక, ఇతర భాషా మాధ్యమంలో జరిగితే, విద్యార్థి తన ఎక్కువ కాలాన్ని ఆ భాషను నేర్చుకోవడంతోనే సరిపుచ్చుతాడు. "... విద్యార్థికి, ఉపాధ్యాయునికి విజ్ఞానశాస్త్రము, గణితముల పైన కన్నా, ఆ భాషను నేర్చుకోవడం పైననే అధిక దృష్టి పెట్టవలసి వస్తుంది. కాబట్టి, విజ్ఞానశాస్త్రపు, గణితపు ప్రాథమిక విషయాలు

తెలుసుకోవాలన్నా, కారణాలు కనుగొనాలన్నా, సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలన్నా, అత్యుత్తమమైన మార్గం మాతృభాషలో విద్యాబోధనయే." *@ (Ricardo and Nolasco, 2009: 11)*

కేవలం, మాతృభాషలో విద్యాబోధన ద్వారానే ప్రగతి సాధ్యం అన్న సత్యం, పైన తెలిపిన ప్రపంచ వ్యాప్త పరిశోధనల ద్వారా, ప్రముఖుల అభిప్రాయాల ద్వారా స్పష్టమైనది కదా! కాని, ఇక్కడ, ఈ మన భారత దేశంలో భాష, విద్యావిషయాలపై ప్రణాళికలు సిద్ధము చేయవలసిన పెద్దలు ఆంగ్ల భాష ముందు మోకరిల్లి, కళ్లు ఉండి అంధులు, చెవులుండి బధిరిలు అవుతున్నారు. భారత దేశపు విద్య, భాష, సంస్కృతులకు రక్షణ లేకుండా చేస్తున్నారు. నేను ఇంతకుముందే విన్నవించినట్టు – నా ఉద్దేశ్యము, వీరి కళ్లు తెరిపించాలని, వినగలిగి చెవిలో దూది పెట్టుకున్న వీళ్ల చెవుల నుండి దూదిని తీయించాలని.

అంతర్జాతీయంగా చేసిన పరిశోధనల ఫలితాలు వీరి పిరికితనాన్ని, అవివేకాన్ని ఎండగట్టడానికి బాగా ఉపకరిస్తాయి. మాతృభాషా మాధ్యమం ద్వారా విద్యా బోధన, విద్యా వ్యవస్థలో పురోగతిని సాధించడమే కాదు, విదేశీ భాషలను నేర్చుకోవడానికి కూడా విదేశీభాషా మాధ్యమం కన్న బహు బాగా ఉపకరిస్తుంది అని తేటతెల్లమవుతుంది. అది ఏ విధంగానో చూద్దాం!

III. విదేశీ భాషను నేర్చుకోవడంలో మాతృభాషా మాధ్యమం – విదేశీభాషా మాధ్యమం

దీన్ని UNESCO వారి ప్రకటనతోనే ప్రారంభించడం సముచితంగా ఉంటుంది.

III. 1. "'భాష – అభ్యసనము' అన్న విషయాల మీద మనకు కొన్ని అపోహలు ఉన్నాయి. ఆ అపోహలను దూరంచేయవలసిన ఆవశ్యకత ఉన్నది. ఒకటవ అపోహ: 'విదేశీభాషను నేర్చుకోవాలంటే, ఆ భాషా మాధ్యమంలోనే దాన్ని నేర్చుకోగలము.' (వాస్తవంగా ఆ భాషను ఒక సబ్జెక్టుగా మాత్రమే నేర్చుకోవడం ఉత్తమం), రెండవ అపోహ: 'ఒక విదేశీభాషను నేర్చుకోవాలంటే బాల్యము నుండే ప్రారంభించాలి.' (బాల్యము నుండే నేర్చుకోవడంవల్ల ఆ భాషోచ్చారణ బాగా ఉంటుందేమో కాని ప్రథమ భాషగా మాతృభాషను అభ్యసించి ప్రావీణ్యతను సంపాదించిన వ్యక్తియే విదేశీభాషను బాగుగా గ్రహించగలడు), మూడవ అపోహ: 'విదేశీ భాషలను నేర్చుకోవడంలో మాతృభాష అవరోధంగా నిలుస్తుంది.' (వాస్తవానికి, మాతృభాషలో సంపాదించుకున్న ప్రావీణ్యత విదేశీ భాషలను నేర్చుకోవడానికి చాల బాగా దోహదకారి అవుతుంది.) ఈ అపోహలు అపోహలే, వాస్తవం కావు. కాని, భాషాభ్యసన విధాన రూపకర్తలకు మార్గదర్శకాలు కాగలుగుతాయి." *@ (UNESCO, 2008: 12)*

అన్ని ఖండాలలో విస్తరించిన 12 దేశాలలో జరిపిన పరిశీలనలు ఎలా ఉన్నాయో చూద్దాం. వీనిలో భారతదేశము కూడ ఉన్నది. ప్రపంచ బ్యాంకు భారతదేశంలోని పరిశోధనల కొరకు నిధులను కేటాయించింది. ప్రపంచ బ్యాంకైతే ఆంగ్లభాషకు విరోధి కాదు గదా!

ఆసక్తిని గొలిపే ఒక పరిశీలనను గమనిద్దాం! "ఫిన్లాండ్ దేశములో కొన్ని సంవత్సరాల పాటు పాఠశాలకు వెళ్లి, ప్రథమ భాష/మాతృభాషగా ఫిన్నిష్ భాషను, ద్వితీయ/విదేశీ భాషగా స్వీడిష్ భాషను నేర్చుకొన్న విద్యార్థి, స్వీడన్ దేశానికి వలస వెళ్లినప్పుడు రెండు భాషలలోనూ సమాన ప్రతిభను చూపగలిగాడు. సరాసరిగా 10 సంవత్సరముల వయసుగల విద్యార్థులు ఫిన్లాండ్ నుండి స్వీడన్ కు వెళ్లి స్థిరపడిన సందర్భంలో, తమ మాతృభాషయైన ఫిన్నిష్ లో ప్రతిభ కనపఱచడమే కాక, స్వీడన్ లోని విద్యార్థులతో స్వీడిష్ భాషలో సరితూగగలిగారు. కాని, 6 సంవత్సరముల కన్న తక్కువ వయసు ఉన్నప్పుడే స్వీడను వెళ్లి స్థిరపడిన వాళ్లో, లేదా స్వీడను లోనే జన్మించిన వారో ఇంతగా తమ ప్రతిభను కనబరచలేకపోయారు. వీరి స్వీడిష్ భాషా ప్రావీణ్యపు పెరుగుదల 12 సంవత్సరముల వయసులో ఆగిపోయింది. కారణం, వీరికి మాతృభాషయైన ఫిన్నిష్ లో గట్టి పునాది లేకపోవడం." @ *(Paulston, 1977: 92-3)*

మాతృభాషా మాధ్యమములో చదివినవారు మాత్రమే విదేశీ భాష/ ద్వితీయ భాషను బాగా నేర్చుకొనగలరని ఋజువైంది. ఇది ఎలా సాధ్యం అన్న దానిని ఇప్పుడు చూద్దాం:

"విదేశీ భాషను నేర్చుకొనుట లేదా బోధించుట అనే ప్రక్రియలో మాతృభాష పాత్ర చాల ఉంటుందని Butzkamm నొక్కి చెప్తాడు. మాతృభాషా ప్రభావమున్న పరిసరాలలో పెరిగిన వానికి తన చుట్టూ ఉన్న విషయాలు మనసులో ముద్రపడిపోయి, భాషను సాధనంగా చేసుకొని అభిప్రాయాలను భావయుక్తంగా సులభంగా వ్యక్తపఱచగలుగుతాడు. వ్యాకరణాంశాలు, భాషా సౌందర్యపు ప్రక్రియలు జన్మతః వచ్చియుంటాయి. ఇక చదవడం, వ్రాయడం అనే నైపుణ్యాలను సంతరించుకోవడం సులభం. ఈ విధంగా మాతృభాషలో నైపుణ్యము సాధించిన తరువాత విదేశీ భాష నేర్చుకోవడం సులభతరం అవుతుంది." @ *(WIKIPEDIA)*

"తెలివిపరులు తమ భాషాభ్యసనము ద్వారా నేర్చుకొనిన భాషానైపుణ్యాలను, ప్రాపంచిక విజ్ఞానాన్ని బహుబాగా సద్వినియోగపఱచుకుంటారు. చాలవరకు ఒక విషయాన్ని కొత్త భాషలో భావించుకునే అవసరం వీరికి రాదు. ఎందుకంటే వీళ్లు ఇదివరకే అవసరమగు జ్ఞానాన్ని పొందియున్నారు. వేరు వేరు భాషల వ్యాకరణ సంబంధమైన నియమనిబంధనలు ఒకే తీరుగా లేకపోయి నప్పటికీ వచనము, లింగము, కర్త, కర్మ, క్రియ, నకారాత్మక భావన, వస్తు స్థితి, కాలము మొదలగు భావనలన్నియు అన్ని భాషలలో ఇంచుమించు ఒకే తీరుగా ఉంటాయి." @ *http://en.wikipedia.org/wiki/Wolfgang_Budzkamm*.

ఇంతవరకు నిర్ధారించబడిన వాస్తవాలు భారతదేశపు విధానకర్తల కళ్లను, చెవులను తెరిపించడానికి సరిపోతాయి. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా, భాషా పరంగా జరుగుతున్న విషయాలను తెలుసుకుంటే నష్టమేమీ లేదు.

వాస్తవానికి, ఎక్కడెక్కడైతే ఆంగ్లము విదేశీభాషా మాధ్యమముగా చలామణి అవుతూ వస్తున్నదో, అక్కడక్కడ అంతర్ధానమవుతున్నది లేదా మసకబారుతున్నది. దీన్ని నిర్ధారించడానికి కొన్ని నిదర్శనాలు:

2007 సంవత్సరములో, ఉగాండా తమ దేశపు పాఠశాలలలో మాతృ భాషా మాధ్యమము ద్వారా బోధన కొనసాగిస్తూ, ఆంగ్ల భాషను ఒక సబ్జెక్టుగా నేర్పాలని నిర్ణయించి అమలుపఱచింది. 2008 లో ఫలితాలను మదింపువేసి చూడగా అక్షరాస్యత శాతం పెరిగిందని తెలిసింది.

ఉగాండాలో 52 ప్రాంతీయ భాషలు వ్యవహారంలో ఉన్నాయి. మాతృభాషలో ప్రావీణ్యమును సంపాదించిన విద్యార్థి విదేశీ భాషను అతి సులభంగా నేర్చుకొనగలుగుతాడని ఋజువైంది. ఈ విధానమును అమలుపఱచకముందు ఉగాండాలో పాఠశాల విద్య ఆంగ్ల మాధ్యమము లోనే ఉండేది. *(See Kavuma, 2009 for these facts)*.

మలేసియా, 2009 సంవత్సరములో, తమ దేశపు జాతీయ పాఠశాలలో గణితమును, విజ్ఞాన శాస్త్రమును భాషా మలేసియా లో బోధించాలని, ప్రాంతీయ పాఠశాలలలో చైనీస్ భాషలోను, తమిళభాషలోను బోధించాలని నిర్ణయించింది.

మలేసియాలోని తమిళులకు విజ్ఞానశాస్త్రాన్ని తమిళ మాధ్యమములోనే బోధించడం సముచితం అని మలేసియా నిర్ణయించింది. కాని, మన దేశములో అది దోషంగా భావించబడుతున్నది. ఆంగ్ల భాషా వ్యామోహములో పడిన విధాన కర్తలు విచక్షణను కోల్పోతున్నారు. ఇంకా కొన్ని విషయాలను సాక్ష్యాధారాలతో నున్న వానిని పరిశీలించి చూడడంలో నష్టమేమీ లేదనుకుంటాను.

"న్యూజీలాండ్, బ్రిటను దేశాలు తమ స్వదేశీ అల్ప సంఖ్యాకుల భాషలకు (విదేశాలనుండి వలసవచ్చిన వారి భాషలకు కాకుండా) కొంత కాలంగా మంచి గుర్తింపునిస్తూ వస్తున్నాయి. తమ పాఠశాలలలో బోధనా మాధ్యమంగా కూడా చేశాయి. ఎస్. మే గారు ఒక సకారాత్మక దృష్టితో మాఓరి (Maori) భాషకు, సంస్కృతికి పెద్ద పీటను వేశారు. విదేశీ భాషను గూడ నేర్పుతూ మాఓరి భాషను బోధనా మాధ్యమముగా చేసి నడుపుతున్న పాఠశాలల ప్రాథమిక ఫలితాలను గమనిస్తే, చాల బాగున్నాయి. హాంకాంగ్ లో స్వదేశీ భాషయైన కాంటోనీస్ (Cantonese)ను, ఆంగ్లమును కూడ బోధనామాధ్యమముగా చేసి, పుతోంగ్వా (Puntonghua) అనే భాషకు కూడ ప్రాధాన్యతను యిస్తూ బోధిస్తున్నారు. పుతోంగ్వా భాషాభివృద్ధి గూడ జరుగుతున్నది. మలేసియా తద్విరుద్ధముగా, ఆంగ్ల భాష ప్రాధాన్యతను తగ్గించి, దేశమంతటా తమ భాషయైన మలేయ్ (Malay) భాషను అధికార భాషగా చేసింది. పాఠశాలలలోను, విశ్వవిద్యాలయాలలోను బోధనామాధ్యమముగా మలేయ్ భాషను అమలుపఱచింది (S. Kaur Gill, pp. 135-152)." *@ (Ammon, 2004)*

వీటన్నింటిని గమనిస్తే, గతములో ఆంగ్ల భాషా ప్రభావానికి లోనైన అన్ని దేశాలు ఆంగ్లమునకు వీడ్కోలు పలుకుతున్నాయి (మానసికంగా బానిసత్వానికి, అవివేకానికి గురియైన భారతీయులం తప్ప).

ఇలా ఒక్క భారతదేశములోనే ఎందుకు జరుగుతున్నది? కారణం, భారతీయ 'మనువాదం'. కుహనా మేధావులు ఆంగ్ల భాషను సాధనంగా చేసుకొని, ఇతర భారతీయులను అన్ని విధాలా కొల్లగొట్టాలని, దోచుకోవాలని చూడడమే. కనుక, ఈ అధునిక యుగంలో, ఈ ఛాందస వాదాన్ని ధ్వంసమొనర్చవలసిన అవసరం ఉన్నది. ఇలాంటి

అంధవిశ్వాసాలను స్టాక్ హోమ్ విశ్వవిద్యాలయపు రిపోర్టు బట్టబయలు చేసింది (see Benson, 2005). ఈ అపోహల్లో కొన్నింటిని కింద పేర్కొనడమైంది.

III. 2. భాషా పరంగా మరికొన్ని అంధవిశ్వాసాలు

III.2.1. "ఒకే దేశం, ఒకే భాష అనే అంధవిశ్వాసం: దేశానికి, రాష్ట్రాలకు ఒకే భాష ఉపయుక్తమని భావించి ఒక విదేశీ భాషను అమలుచేసినా దేశ సమైఖ్యతను సాధించలేకపోయాయి. దాదాపు ఏక భాషా దేశాలైన సోమాలియా, బురాండీ, రవాండాలలో స్థిరత్వాన్ని సాధించలేదు. బంగ్లాదేశ్, పాకిస్తాన్, మయన్మార్, శ్రీలంక లలో జాతిగత, భాషాగత విభేధాలకు సంబంధించి ఆయా ప్రభుత్వాలు ఈ సూత్రం పై పరాజయం పాలయ్యాయి (Ouane 2003)." *@ (Benson, 2009)*

III. 2.2. "ప్రాంతీయ భాషలు ఆధునిక భావనలను స్పష్టంగా వ్యక్తీకరింపజాలవనేది మరొక అంధ విశ్వాసం: ఏ ఇతర భాషలకన్నా, యూరపు భాషలకు సహజసిద్ధంగా సామర్ధ్యం గొప్పదన్న అపోహ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ భాష అన్నింటా సామర్ధ్యాన్ని ప్రదర్శించగలదు, సాంకేతిక పదాలను సృష్టించడం, విస్తరింపజేయడంతో సహా. ఐనుస్టేన్ సాపేక్ష సిద్ధాంతాన్ని సెనెగల్ భాషలో లియోపోల్డ్ సెంఘర్ అనువదించి చూపడమే దీనికి నిదర్శనం (Alexander, 2003)." *@ (Benson, 2009)*

పై విషయాల ద్వారా, ఏ భాషలోనైనా, ఏ భావననైనా స్పష్టంగా తెలియజేయవచ్చునని ఋజువైంది. ఈ అవివేకాన్ని తొలగించాలంటే ఇంకొంచం లోతుకు వెళ్లి చూడాలి.

వాక్యనిర్మాణ పరంగా ఆలోచిస్తే ఏ భాషయైనా ఇతర భాషలలోకి అత్యుత్తమంగా లేదా అతి హీనంగా అనువదింపబడదు. వ్యాకరణ పుస్తకాలు చదివి వ్రాసిన దాని లాగానే బాగానే ఉంటుంది. కనుక, వాక్య పరంగా ఆలోచిస్తే అన్ని భాషలూ గొప్పవే. శబ్ద సంపదను బట్టి ఆ భాష గొప్పదా కాదా అనే భావన కలుగుతుంది, అంతే!

విజ్ఞానశాస్త్ర, సాంకేతికశాస్త్రములకు చెందిన పదములను విశదపరచడానికి మన భాషలో తగిన పదములు లేవు అని అంటుంటారు. భాషలలోనున్న 'శబ్దనిధి' ని గురించి తెలియనివారు మాత్రమే ఈ విధంగా మాట్లాడుతుంటారు.

ప్రతి భాషలోను తగిన పదములు లభిస్తాయి. ఎందుకంటే, అన్ని భాషా పదాలు ఏదో ఒక ప్రాథమిక మూలమును కలిగి ఉంటాయి. భాషలలోనున్న పదములను పరిశీలించి చూస్తే పెద్దగా తేడాలు కనిపించవుకూడా. క్రింది ఆంగ్ల పదాలు ఈ విషయాన్ని వివరిస్తాయి:

1. "**Haem** - A prefix signifying blood.
2. **Haemocyte** - A blood cell.
3. **Haemagogue** - Medicine that promotes the catamenial and haemorrhoidal discharges.

4. **Haemal** - Pertaining to the blood.

5. **Haemalopia** - An effusion of the blood into the globe of the eye; bloodshot eye.

6. **Haemngiectasis** - Dilation of a blood vessel.

7. **Haemangioma** - A malformation of a blood vessel which may occur in any part of the body.

8. **Haemarthrosis** - The presence of blood in a joint cavity.

9. **Haematemesis** - The vomiting of blood.

10. **Haematin** - An iron-containing constituent of hemoglobin.

11. **Haematinic** - An agent improving the blood-quality.

12. **Haematinuria** - The presence of haematin in the urine.

13. **Haematocele** - A swelling filled with blood; haematoma.

14. **Haematocolpos** - Retention of the menses due to a congenital obstruction of vagina.

15. **Haematogenesis** - The development of the blood.

16. **Haematoid** - Having the nature or appearance of blood.

17. **Haematology** - The science dealing with the formation, composition, functions and diseases of the blood.

18. **Haematolysis** - Destruction of blood cells and liberation of haemoglobin.

19. **Haematoma** - The blood tumor; H. Auris, the blood tumor of the external."
(With thanks from Rawat, 1985)

20. **Haemophilia** - Tendency of blood not to clot.

మొదట చూడగానే, పై పదాలకు సమానార్థక పదాలు మన భాషలలో లేవు అనిపిస్తుంది. కాని, నిజమేమిటంటే ఒక మూల పదానికి చివరలో పదాలు చేర్చడం వల్ల కొత్త పదాలు ఏర్పడ్డాయి. ఇక్కడ 'Haem' కు అర్థం 'రక్తం'. క్రింది హిందీ పదాలను గమనిస్తే మన భాషలలో సమానార్థకములు ఉన్నాయని లేదా మనం సులభంగా సేకరించుకోగలమని బోధపడుతూంది:

1. రక్త్, 2. రక్త్-కోశికా, 3. రక్త్-ప్రేరక్, 4. రక్తీయ్, 5. రక్తియ్-నేత్ర్, 6. రక్తవాహినీ-పాసార్, 7. రక్త్-మస్సా, 8. రక్తజోడ్-వికార్, 9. రక్త్-వామన్, 10. లౌహరక్తీయ్, 11. రక్తవర్ధక్, 12. రక్త్-మూత్ర్, 13. రక్త్-గ్రంథి/సూజన్, 14. రక్త్-మాసధర్మరోధ్, 15. రక్త్-ఉత్పాదన్, 16. రక్త్-రూప్, 17. రక్త్-విజ్ఞాన్, 18. రక్త్-ప్రోస్, 19. రక్త్-గ్రంథి, 20. రక్త్-జమాప్వీనత.

మనసుంటే మార్గముంటుందని బోధపడుతున్నది.

పైన పేర్కొన్న ఆంగ్ల పదసంపద యావత్తూ అరువుతెచ్చుకొన్నదే. ఇవన్నీ లాటిన్ భాష నుండి నేరుగా అరువు తెచ్చుకున్నవే. ప్రస్తుతపు ఆంగ్ల భాషలో నున్న విజ్ఞానశాస్త్ర పదజాలంలో ఎక్కువ భాగం లాటిన్ లేదా గ్రీకు మూలాన్నించి తీసుకొన్నదే. కాబట్టి విజ్ఞానశాస్త్ర పదాలను అర్థంచేసుకొనడానికి ఆంగ్ల భాషపై పట్టుండాలి అనడం అపోహ మాత్రమే.

భాషాపరంగా, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న విషయాలను గమనిస్తే 'ఆంగ్లభాష - ప్రపంచ భాష' అన్న అంధ విశ్వాసం లేదా అపోహ పటాపంచలు అవుతుంది.

III.2.3. "విదేశీ భాష/ ద్వితీయ భాష అనేది విద్య, ఉపాది అవసరాలకు ఆవశ్యకము అనిపిస్తుంది. కాని, ఫిల్లిప్సన్ (1992) ఏమంటాడంటే ..... శక్తిమంతమైన దేశాలు తమ భాషలకు విస్తృత ప్రచారం చేయడం వల్ల అలా గోచరిస్తుందని. అల్పాదాయము కలిగిన దేశాలలో, అసంఘటిత రంగములలో ఉపాది అవకాశాలను గమనిస్తే, 50% లేదా అంతకంటే ఎక్కువ ప్రాథమిక విద్య పూర్తిచేసుకున్న వారితోనే నిండి ఉన్నది (Bruthiaux, 2002)." *@ (Benson, 2005)*

IV. ప్రస్తుత భాషాసంబంధమైన దృశ్యం

రెండు ధోరణులు స్పష్టంగా గోచరిస్తున్నాయి: (1) ఆంగ్ల భాషా ప్రాధాన్యత మసకబారుతుండడం, (2) ఆంగ్లేతర భాషల ప్రాధాన్యత అన్ని రంగాలలో పెరుగుతుండడం.

ఏ దేశాలలో నైతే వారి మాతృభాషలో కాక, ఆంగ్ల భాషలో విద్యాబోధన జరుపబడినదో ఆ దేశాలలో ఆంగ్లమును పూర్తిగా తొలగించడం గాని లేదా తొలగించే ప్రక్రియ గాని జరిగింది లేదా జరుగుతున్నది, ఒక్క ఘునత వహించిన భారతదేశము, దానిని ఆనుకొనియున్న పాకిస్తాన్ లో తప్ప.

2000 సంవత్సరము వరకు 80% దాకా అంతర్జాలం (internet) ఆంగ్ల భాష ఆధీనములో ఉన్నది. ఇప్పుడు 40% వరకు తగ్గిపోయింది. ఇప్పుడు అంతర్జాలం పలు భాషలలో లభ్యమవుతున్నది.

మైక్రోసాఫ్ట్ ను ఉట్టంకించి చెప్పాలంటే, భారతదేశము లో 95% వ్యాపారము భారతీయ భాషలలోను, కేవలము 5% ఆంగ్ల భాషలోను నిర్వహించబడుతున్నది.

ఆంగ్లము మాత్రమే తెలిసియుండి, ఏ ఇతర భాషాజ్ఞానము లేని వ్యక్తికి ఈ రోజుల్లో ఉద్యోగము ఇవ్వడానికి కంపెనీలు ముందుకు రావడం లేదు. ఈ విషయాన్ని ప్రఖ్యాత ఆంగ్ల పత్రిక "The Economist" స్పష్టంచేస్తూ, బ్రిటన్ వాసులకు ఆంగ్లము మాత్రమే తెలిసియున్నందున ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని వ్రాసింది. భాషాపరంగా, ప్రపంచవ్యాప్తంగా ఏ దేశాలు ఏ దిశగా పయనిస్తున్నాయో తెలుసుకోవాలంటే ఈ క్రింది విషయాన్ని చదవాలి:

"ఆంగ్లేతర భాషలలో మౌఖిక, లిఖిత వ్యక్తీకరణ నైపుణ్యము కలిగియుండడమే కాక, తమ సాంఘిక, సాంస్కృతిక వ్యవహారాలతో సంబంధము లేని వారితోను కలసిపోగలగాలి." @ *(Stephanie Bell Rose, The Goldman Sachs Foundation; Vishakha Desai, The Asia Society, www).*

"ఇతర దేశాలు ఆంగ్లేతర భాషలకు ప్రాధాన్యతనిస్తూ, ఆర్థిక సహాయాన్ని కూడ అందిస్తుండడం వల్ల, అమెరికా విద్యార్థులు ప్రపంచ వాణిజ్య క్షేత్రములో వెనుకబడి పోతున్నారు. ఇంకా కష్టాలను ఎదుర్కోబోతున్నారు." @ *(Asia Society News, 2nd April, 2009, www)*

"గుత్తాధిపత్యాన్ని కోల్పోతున్న ఆంగ్లము....."

"20వ శతాబ్దపు చివరి వరకు ఆంగ్లము తన గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తూ వచ్చింది. కాని 21వ శతాబ్దములో ఏ ఒక్క భాష కూడ గుత్తాధిపత్య స్థానాన్ని ఆక్రమించజాలదు."

"ఉపగ్రహ ప్రసారాలన్నిటినీ ప్రధానమైన ఆంగ్లేతర భాషలు ప్రపంచ వ్యాప్తంగా ఆక్రమిస్తాయి. 21వ శతాబ్దములో దృశ్య శ్రవణ మాధ్యమాలు బహుభాషామయంగా తయారవుతాయి."

"ఆంగ్లభాషకు సాంకేతిక సమాచార వ్యవస్థకు గల అవినాభావ సంబంధం ఇక తాత్కాలికమే అవుతుంది. ఇక ఆంగ్ల భాషను మాత్రమే ఎరిగియున్న వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానము అందని ద్రాక్ష పండే అవుతుంది." @ *(David Graddol, 2000 (1997))*

"ప్రపంచ వ్యాప్తంగా, వర్ధమాన దేశాలన్నీ తమ విద్యార్థులకు మాతృ భాషతో పాటు ఇతర విదేశీ భాషలను కూడ నేర్పాలని చూస్తున్నాయి. అయితే ఆ భాష ఆంగ్లమే కావాలని లేదు.

ఇప్పుడు అమెరికాలో కూడ చైనీస్ భాషా మాధ్యమ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఇందులో చేరుతున్న వారిలో 90% మంది చైనా భాష నేపథ్యము కలవారు కాకపోవడము విశేషము (ఇది పాలసీకి విరుద్ధంగా భాసించినప్పటికీ చైనీస్ భాష ఎదుగుతున్నదనడానికి నిదర్శనం). అమెరికాలో చైనా భాష నేర్చుకునే వారి సంఖ్య 2000 సంవత్సరముతో పోలిస్తే 2007 సంవత్సరము వచ్చే సరికి పదింతలైంది. *(USA Today, 20th November, 2007)*

ప్రధానంగా ఆంగ్లమును మాత్రమే మాట్లాడు దేశాలలో సైతం, ఆంగ్లము మాతృభాష కానివారు ఆంగ్లమును వదిలిపెడుతున్నారు. అమెరికా దేశపు 1990 సంవత్సరపు జనాభా గణనలో తేలిందేమిటంటే 31.8 మిలియన్ల మంది తమ గృహాలలో ఆంగ్ల భాషను మాట్లాడడం లేదని చెప్పారు. 2000 సంవత్సరపు జనాభా గణనలో ఈ సంఖ్య 47 మిలియన్లకు చేరింది. జనాభా పెరుగుదల శాతము కన్న, ఆంగ్లేతర భాషను మాట్లాడేవారి సంఖ్య అత్యధికంగా పెరిగింది. 1980 నుండి 2011 వరకు అమెరికా జనాభా 40% పెరిగితే, ఇంటి వద్ద ఆంగ్లము మాట్లాడని వారి సంఖ్య 140% పెరిగింది. భారత దేశములో మాత్రము కుహనా మేధావులు జాతీయాభిమానమును వదిలిపెట్టి ముప్పూటలా ఆంగ్ల విధేయతను చాటుకుంటున్నారు.

ప్రసారమాధ్యమాల నుండి ఆంగ్లము ఏ విధంగా దూరము అయిందో చెప్పడానికి అర్జెంటీనా భేషైన ఉదాహరణ. 1983 లో అర్జెంటీనా లోని ప్రసారమాధ్యమం 49% వరకు విదేశీ హస్తగతం. 1996 వచ్చేవరకు అది 22 శాతానికి పడిపోయింది.

గతంలో తన ప్రాభవాన్ని చాటుకున్న దేశాలనుండి ఆంగ్ల భాష క్రమంగా కనుమరుగవుతున్నదన్నది అక్షర సత్యం.

ఇంటర్నెట్, కంప్యూటరు, మొబైల్ ఫోన్లు, e-పుస్తకాలు మొదలైన వాటికి సంబంధించిన వ్యాపార విషయాలలో ప్రాంతీయ భాషల ప్రాధాన్యతే ఎక్కువ అనడం అతిశయోక్తి కాదు.

ఆంగ్ల భాష మనలను విద్యాపరంగా, ఆర్థికపరంగా, వ్యాపారపరంగా, సాంస్కృతికపరంగా ఎంత నష్టపఱచిందో బేరీజువేసుకోవలసిన అవసరం ఉన్నది.

V. ఆంగ్లములోనే అంతా ఉన్నది అనుకోవడం వల్ల కలిగిన నష్టాలు

విస్తరిస్తున్న వాణిజ్య అవసరాల దృష్ట్యా, దాదాపుగా అన్ని దేశాలు ఇతర దేశ భాషలను నేర్చుకోవడంలో నిమగ్నమై ఉన్నాయి. కాని, మనం మాత్రం ఆంగ్లమును వదలడంలేదు. ఇతర దేశాల భాషలు నేర్చుకుందామని మనం ఏ చిన్న ప్రయత్నమూ చేయడంలేదు. తత్కారణంగా మనం ఎన్నో ఆర్థిక, వాణిజ్య నష్టాలను చవిచూస్తున్నాము. ఇలాగే ఉంటే మనం ఏకాకులం కాకపోము. ప్రస్తుతం, మనకు ఆంగ్లము కన్న చైనీస్, స్పానిష్ భాషల అవసరము చాల ఉన్నది. ప్రస్తుతాన్నే మనం గుర్తించడం లేదు. భవిష్యత్తు దేవుడికెరుక. ప్రపంచ దేశాలన్నీ ఆంగ్లాన్ని వదులుకుంటుంటే మనం మాత్రం మన చదువు సంస్కృతులను ఆంగ్లానికి అప్పగిస్తున్నాము. ప్రపంచ వాణిజ్యంలో మన వాటా నిశితంగా పరిశీలించినట్లైతే మనం కోల్పోయిందేమిటో అర్థమవుతుంది. ప్రపంచ వాణిజ్యంలో మన దేశ వాటా 1950 సంవత్సరంలో 1.78 శాతమైతే, ఇప్పుడు అది 1.50 శాతానికి పడిపోయింది. ఇదే కాలంలో, భారత దేశంలో ఆంగ్లభాషా వ్యాప్తి అనేది మనకు సుస్పష్టమైన విషయమే. వాణిజ్యంలో వాటా క్షీణతలను చూస్తే, మన మేధావుల పనితనం గుడ్డెద్దు చేనిలో పడ్డట్టు ఉన్నదనిపిస్తుంది. కొద్దిరోజుల క్రితం ఐక్యరాజ్య మంత్రిచే కీర్తింపబడే మాన్య మంత్రివర్యులు శ్రీ శశి థరూర్ గారి కథనం ..... “భారత దేశ ప్రగతిలో ఆంగ్లము కీలక పాత్ర పోషించింది” అని. భాషలపై ఐ.రా.స. ప్రచురించిన పుస్తకాలను థరూర్ గారు చదివి వుంటే ఈ మాట అనేవారుకాదు. భారతదేశములోనున్న నిరక్షరాస్యత తోనే పెక్కు లాభాలు. ఒక సదరు భారతదేశ మంత్రికి పుస్తకాలు చదువవలసిన అగత్యం ఏమిటి చెప్పండి.

సాంస్కృతికంగా ఆంగ్ల భాష మనకు ఎంత నష్టాన్ని కలిగించిదో, కలిగిస్తున్నదో, ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మేలు. కూపస్త మండూకపు జాతి తయారవుతున్నది. వీరికి తమ భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, మతం, విజ్ఞానం, కళలు, వీటిల్లో దేనితో కూడ పరిచయంలేకుండా పోతున్నది. ఆనాడు పర్షియన్ భాషతో ప్రేమవ్యవహారాలను నడిపించిన భారతీయ మేధావులను బాబా నానక్ గారు ‘పతితులు’ అన్నారు. ఆ బాబా నానక్ గారి సందేశాలనే భూస్థాపితం చేసిన ఈ మేధావులకు మహాత్మా గాంధీ గారు ఒక లెక్కా? ఆయనైతే ధోతీ ధరించిన

వాడాయే! అతడే భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి, సూటు, బూటు వేసుకొని ఉంటే పరిస్థితులు ఇంకా ఎలా ఉండేవో?

VI. అంపశయ్యపై భాష

ఈ మధ్యనే వెలువడిన నా వ్యాసంలో (జోగా సింగ్, 2013), ఆంగ్ల భాష కంటే ఎక్కువగా సాహిత్య చరిత్రను కలిగి ఉన్న, సుసంపన్నమైన, ప్రపంచములో అత్యధికులు మాట్లాడే భాషలలో 10వ స్థానాన్ని అధిష్టించిన, పంజాబ్ రాష్ట్ర అధికార భాషయైన పంజాబీ లాంటి భాషయే అంపశయ్యపై ఉందని వ్రాశాను. రాజ్యాంగంచేత గుర్తింపబడిన ఇతర భారతీయ భాషల స్థితిగూడా ఇంచుమించుగా ఇంతే. రాజ్యాంగము చేత గుర్తింపబడని భాషల గురించి ఇంకెందుకు చెప్పుకోవడం. వాటిల్లో చాల భాషలు మృత్యువునకు సమీపంలో ఉన్నాయి. నేను పాఠకులను 'Language Vitality and Endangerment' అనే UNESCO (2003) డాక్యుమెంటును చదువవలసినదిగా సవినయంగా విజ్ఞప్తిచేస్తున్నాను. ఇంతకన్నా ఎక్కువగా నేనేమీ చెప్పదలుచుకోలేదు. భారతీయ భాషలు ఏ దిశలో పయనిస్తాయో తెలుసుకోవాలంటే ఈ క్రింది కథనాలను చూడండి.

"భాష ఎలా మరణిస్తుందంటే, ప్రజలు తమ భాషను మాట్లాడడానికి సిగ్గుపడడం, గొప్పగా భావింపబడే భాషకు దాసోహం అనడం. ఫలితంగా, తమ ముందు తరాల వారికి తమ భాషను అందివ్వలేకపోవడం, 'అది క్రమంగా అల్ప సంఖ్యాకులు మాట్లాడే భాషగా మారిపోవడం, మెల్లమెల్లగా కనుమరుగై మృత భాషగా మారిపోవడం' (McMahon, 1994: 285)." *@ (Eckert, T et al, 2006)*

"ప్రాంతీయ భాషలను పాఠశాలలలో నేర్పకపోవడం వల్లకూడా ఆయా భాషలు మృత భాషలుగా మారే అవకాశం ఉంది. ప్రాంతీయ భాషల మనుగడకు, వాటిని మాట్లాడే వారి సంస్కృతి పరిరక్షణకు పాఠశాలలు కీలక పాత్రను పోషిస్తాయి." *@ (Eckert, T et al, 2006).* మన భారతీయ మేధావులు తలచుకుంటే, అన్ని మాతృ భాషా మాధ్యమ పాఠశాలలను మూసివేయించగలరుకూడా. ఆంగ్ల భాషను గురించి 'నాలెడ్జ్ కమిషన్' యొక్క అవివేకపు సిఫార్సులను మీరే స్వయంగా చదివి తెలుసుకోండి. ఇది ఒక తెలివిహీనమైన సంస్థ.

VII. విజ్ఞప్తి

భాషా నీతిపై నేను రచించిన పుస్తకము ప్రచురింపబడడానికి ఇంకా కొంత సమయము పట్టేటట్టున్నది. ఆలోపుగా భాషా సమస్యపై అంతర్జాతీయ అభిప్రాయాలను భారతీయ పౌరులందరితో పంచుకోవాలని, వారి అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని అనిపించింది. అందుచేత, నా రాబోయే పుస్తకములోని కొన్ని విషయాలతో ఈ పత్రమును సిద్ధపఱచాను. పంజాబీ భాష లోని పత్రము, పంజాబీ మాధ్యమాల ద్వారా, ఇప్పటికే ప్రాచుర్యాన్ని పొందింది. పంజాబ్ లోని వివిధ ప్రాంతాలలో నేను ఇచ్చిన ఉపన్యాసాల ద్వారా చాల మంది చెంతకు చేరింది. ఈ పత్రము ఈ పాటికే పంజాబీ, హిందీ, ఆంగ్ల భాషలలో ప్రచురింపబడింది కూడా. ఇంకా కొన్ని భారతీయ భాషలలో కూడా సిద్ధమవుతున్నది. మాతృ భాషను ప్రేమిస్తూ, కేవలం మాతృ భాష పునాదులపైననే భారత దేశం ప్రగతి సాధిస్తుందని

విశ్వసించే ప్రతి భారతీయునితో నాది ఒకే ఒక విన్నపం – దయచేసి, ఈ పత్రానికి ప్రాచుర్యం కల్పించండి. ప్రతి భారతీయుని చెంతకు చేరేలా చర్యలు చేపట్టండి. ఇది భారతీయ భాషల లోనికి అనువదింపబడాలని నా వాంఛ. ఎవరు ఏ భాషలోనికి అనువాదం చేయగలుగుతారో ఆ భాష లోనికి అనువదించండని కోరుకుంటున్నాను. అప్పుడు నేను ధన్యుణ్ణి అవుతాను. ఈ పాటికే దీన్ని అనువదించడానికి ఎవరైనా పూనుకొంటే వారు దయచేసి అనువదించడానికి ఉపక్రమించే ముందు నన్ను సంప్రదించవలసినదిగా మనవిచేస్తున్నాను. ఇంతవరకు చర్చించుకున్న విషయాలే కాక, వేల సంవత్సరాలుగా, మన మాతృ భాషలలో పొదగబడిన అపారమైన జ్ఞానాన్ని మన ముందు తరాల వారికి అందించడం మన విధి. ఏమాత్రం జాగుచేసినా, ఒక తరం నష్టపోతుందని గ్రహించాలి.

ఆసక్తి కలిగి, ఇంకా పరిశోధనలు చేయాలనుకునే ఔత్సాహికులకు అందుబాటులో ఉండేలా పుస్తకాల జాబితాను జతపఱచాను.

మాతృ భాషలకు జయమగుగాక!

మాతృ భాషలు వర్ధిల్లాలి!!

ధన్యవాదాలు: మాతృ భాషా సేవలో తరించిన ఎందరో మహారచయితల భావాలను ఈ పత్ర రచనలో వాడుకున్నాను. వారందరికీ వందనాలు.

REFERENCES-CUM-BIBLIOGRAPHY

Alisjabana S. Takdir. 1972. Writing a Normative Grammar for Indonesian. *Language Sciences* (Feb. 1972): 11-14.

_____ . 1976. *Language Planning for Modernization*: The Case of Indonesian and Malaysian. The Hague: Mouton.

Ammon, Ulrich. 2009. Book Review. *Medium of Instruction Policies. Which Agenda? Whose Agenda?* by J.W. Tollefson and A.B.M. Tsui (eds). Mahwah, NJ and London: Lawrence, Erlbaum, 2004.

Bell, R. T. 1976 *Sociolinguistics: Goals, Approaches and Problems*. New York: St. Martins' Press.

Benson, Carol. 2005. *The Importance of Mother Tongue-based Schooling for Educational Quality, Commissioned study for EFA Global Monitoring Report.* Centre for Research on Bilingualism. Stockholm University.

Bernstein, B. 1966. Elaborated and Restricted Code: An Outline. *Sociological Inquiry*. 362:254-61.

_____ . 1971 *Class, Codes and Control: Theoretical Studies towards a Sociology of Language*. Lodon: Routedge & Kegan Paul.

_____ . 1974. A Brief Accont of the Theory of Codes. Appendex to Bernstein 1971.

Boas, F. 1911. *Handbook of American Indian Languages*. Washington: Smithsonian Inst.

Bokmla, E & J. Tlou. 1977. The Consequences of the Language Policies of African States vis-avis Education. In P. Kotey and H. Der-Houssikian, *Language and Linguistic problems of Africa* Colunbia. SC: Hornbeam press.

Branko, F. 1980. Laguage planning and Language policies in Yugoslavia with special Reference to Croation and Macedonian. *Lingua*. 51.1:55-72.

Cronian, S. 1978. Nation Building and the Irish Language Revival Movement. *Eire Ireland*, 13:7-14.

Davis, F. B. (ed.). 1967. *Philippine Language Teaching Experiments*. Quezon city: Alemar phoenix.

De Silva, M. W. S. 1976. *Diglossia and Literacy*. Mysore: central Instiute of Indian Languages.

Dua, H. R. 1976. Language Planning and political Theory. *International Jounral of Sociology of Language* 118:1-6.

Eckert, T. et al. 2006. Is English a 'killer language', the globalisation of a code. *Ethistling* 1:106-18

Fasold, R. 1984. *The Sociolinguistics of Society*. Basil Blackwell.

Ferguson, C. 1968. Language Development. In C. Ferguage & J. Das Gupta (eds.) pp. 27-36.

Ferguage, C. & J. Das Gupta. 1968. *Language Problems of Developing Countries*. New York: John Wiley and Sons.

Fishman, J. 1964. Language Maintenance and Language shift as Fields of Inquiry. *Linguistics.* 9: 32-70.

_____ . 1965. Who Speaks what Language to Whom and When. *Linguistics.* 2 : 67-8.

_____ (ed.) 1968. *Readings in the Sociology of Language*. The Heague : Mounton.

_____ (ed.) 1974. *Advances in Language Planning*. The Hague : Moton.

_____ . 1975. The official Languages of Israel: Their Status in Law and Police Attitudes and Knowledge Concerning Them. In J. Savard and R. Vignaault (eds.), *Multilingual Political Systems: Problems and Solutions*. Quebec : Les preses de I'Universite' Laval pp. 497 535.

Ferguson, C. 1977. Linguistic Theory. *In Bilingual Education: Current Perspectives*. Vol. 2 *Linguistics*. pp. 43-52.

Garvin, P. & M. Mathiot. 1956. The Urbanization of guarani Language. In A.F.C Wallac (ed.), *Men and Cultures: Selected Papers from the Fifth Internatinal Conference of Anthropological and Ethnological Sciences.* Phiadelphia: University of Pennsylvania Press. pp. 365-74.

Gonzatez, G. 1977. Teaching Bilingual Children. In, Bilingual Education Current Perspectives. *Linguistics*: pp 53-9.

Graddol, David. 2000 (1997). *The Future of English? A Guide to Forecasting the Popularity of the English Language in the 21st century*. The Bitish Council.

Halliday, M.A.K. 1973. *The Linguistics Sciences and Language Teaching.* Longman.

Halliday, M.A.K. 1973. *Explorations in the function of Language*. Edward Arnold.

_____ . 1978. *Language as Social Semiotic*. Edward Arnold.

Harries, L. 1976. The Nationalization of Swahili in Kenya. *Language Sciences* 5. 2: 153-64.

Haugen, E. 1966. *Language Conflict and Language planning: The Case of Modern Norwegian*. Cambridge, MA: Harvard University Press.

_____ .1966. Linguistics and Language. In W. Bright (ed.) *Socioliguistics*. The Hague: Mouton pp. 50-71.

_____ .1968. Language Planning in Modern Noway. In J. Fishman (ed.), pp 673-86.

Hopkins, T. 1977. The Development and Implementation of the National Language policy in Kenya. In Kotey & Der Houssikian. pp. 84-96.

Hymes, D. 1972. Models of the Interaction of Language and Social Life. In J.J. Gumperz and D. Hymes, *Directions in Socioliguistics: The Ethrography of Communication*. Holt Rinehart, and Winston Inc. pp. 35-71.

Jakobson, R. 1960. Closing Statement: Linguistics and Poetics. In T. A. Sebeok (ed.), *Style in Language*. MIT. pp. 350-77.

Jernudd, B. 1973. Language Planning as a Type of Language Treatment. In J. Rubin & R. Shuy (eds), *Language Planning: Current issues and Research*. Washington, DC: Georgetown University Press. pp. 11-23.

Labov, W. 1966. *The Social Stratification of English in New York City*. Washington, DC: Centre for Applied Linguistics.

______ .1970. The study of Language in its Social Context. *Studium Generale*. 23:3087 .

Le'vi Strauss, C. 1972. *Structural Anthropology*. Penguin.

Li, C. and S. A. Thompson. 1979. Chinese: Dialect Variation and Language Reform. In T.Shopen (ed.), *Language and Their Status*. Cambridge, MA: Winthrop Publishers. pp. 295-332.

Modiano, N. 1966. *Reading Comprehension in the National Language: A Comparative Study of Bilingual and All Spanish Approaches to Reading Instruction in Selected Indian Schools in the Highlands of Chiapas*. Mexico. Ph.D. Dissertation, University of New York.

______ . 1973. *Indian Education in the Chiapas Highlands*. New York: Holt, Rinchart, and Winston.

Neustupny, J. 1977. Language Planning for Australia. *Language Sciences*, 45:28-31.

Pulston, C.B. 1977. Research. In, Bilingual Education : Current Perspectives. *Linguistics*. pp. 87-151.

Polome', E. and C.P. Hill. 1980. *Language in Tanzania*. Oxford: Oxford University Press for the International African Institute.

Ramos, M. et al. *The Determination and Implementation of Language Policy* Dobbs Ferry, NY: Oceana Publications.

Rawat, P.S. 1985 (1995). *Midline Medical Dictionary.* New Delhi: B Jain Pvt. Publishers Ltd.

Ray, P.S. 1968. *Language Standardization*. In Fishman (ed.). pp. 754-65.

RICARDO MA. DURAN NOLASCO. 2009. *21 Reasons why Filipino children learn better while using their Mother Tongue: A PRIMER on Mother Tongue-based Multilingual Education (MLE) &*

Other Issues on Language and Learning in the Philippines. Guro Formation Forum, University of the Philippines.

Robinson, W.R. 1972. *Language and Social Behaviour*. Penguin.

Rubin, J. 1973. *Language Planning: Discusstion on Some Current Issues*. In Rubin and Shuy (eds.). pp. 1-10.

Rubin, J. and B. Jernudd (eds.). 1971. *Can Languages be Planned*. Honolulu: University Press of Hawaii.

Rubin, J. & R. Shuy (eds.). 1973. *Language Planning: Current Issues and Research*. Washington, DC: Georgetown University Press.

Singh, Joga. 2002. Maat bhaasha da mahatav. *Samdarshi.*

Singh, Joga. 2013 panjabi nu kinna ku khatra (The Intensity of Endangerment to Punjabi, in Punjabi). *Philhal* 17:143-58.

Singh, Joga. 2013. *International Opinion on Language Issues: Mother Tongue is the Key to Education, Science, Knowledge, and English Learning.* Patiala: Madan Publications.

Singh, Joga. 2013. *Bhaasha ke baare me antarrashTri khoj: matri bhaasha kholti hai shiksha, gyan aur angrezi ke darvaze.* Shahdara (Delhi): Lokmittar Parkashan.

Skutnabb-Kangas, T. 1975. Bilingualism, Semibilinguism, and Social Achievment. Paper *Presented at the 4th Internaitonal Congress of Applied Linguistics*. Stuttgart.

______ . and P. Toukomaa. 1976. *Teaching Migrant Children's Mother-Tongue and Learning the Language of the Host Country in the Context of the Socio-cultural Situation of the Migrant Family*. Helsinki: The Finnish National Commission for UNESCO.

Spolsky, B. 1977. American Indian Bilingual Education: Linguistics, 19:57-72.

Tucker, G.R., 1977. Bilingual Education: Current Perspectives, Vol. 2. *Linguistics*. Arlington, VA: Centre for Applied Linguistics.

UNDP Report. 2004.

Unesco. 1953. *The Use of Vernacular Languages in Education*. Monographs on Fundamental Education, No. 8. Paris.

Unesco. 1953. *The Use of Vernacular Languages in Education. Monographs on Fundamental Education, No. 8.* Paris.

Unesco. 1968. *The Use of Vernacular Languages in Education. In Joshua A. Fishman (ed.),*

Unesco. 2008. *The Improvement in the Quality of Mother Tongue - Based Literacy and Learning.* Bankok: Unesco.

Wijnstra, J. 1978. Education of Children with Frisian Home Language. *Paper Presented at the 19th International Conference on Applied Psychology*. Munich.

Whorf, B.L. 1962. Language Thought and Reality. MIT.

భాష – అంతర్జాతీయ భావన

మూలం: **జోగా సింగ్**

JOGA SIGH

M.A., M.Phil., Ph.D. (York, U.K.)

Commonwealth Scholarship Awardee (1990-'93)

Professor & Ex-Head, Department of Linguistics & Punjabi Lexicography

Director, Centre for Diaspora Studies

Punjabi University, Patiala 147 002

Punjab State, INDIA

తెలుగు సేత: **మనోహర్ బోరంచ**

MANOHAR BORANCHA

B.Sc., B.Ed., Dip.Punjabi,

Retd. Gazetted Headmaster

206-H, Bhavya's Anandam Apts.,

Nizampet Road, Hyderabad 500 090 (A.P.)

Phone: 9963311146

Email: mborancha@gmail.com

From this book:

"It is axiomatic that the best medium for teaching a child is his mother tongue. Psychologically it is the system of meaningful signs that in his mind works automatically for expression and understanding. Sociologically, it is means of identification among the members of community to which he belongs. Educationally, he learns more quickly through it than through an unfamiliar linguistic medium. @ *(UNESCO, 1953:11)*

"In the United States, Navajo students instructed throughout their primary school years in their first language (Navajo) as well as their second language (English) outperformed their Navajo-speaking peers educated only in English." @ *(UNDP Report 2004:61)*

"What seems to be standing in our way is a set of myths about language and learning, and these myths must be revealed as such to open people's eyes. **One such myth is that the best way to learn a second (read foreign - JS) language is to use it as a medium of instruction.** (In fact, it is often more effective to learn additional languages as subjects of study.) **Another is that to learn a second language you must start as early as possible.** (Starting early might help learners to have a nice accent, but otherwise the advantage goes to learners who have a well developed first language.) **A third is that the home language gets in the way of learning a second language.** (Building a strong foundation in the first language results in a better learning of additional languages.) Clearly these myths are more false than true, yet they guide the way policymakers tend to think about how speakers of other languages must learn dominant or official languages." @ *(UNESCO, 2008:12).*